క్లుప్తంగా

సత్తెమ్మను దర్శించుకున్న ప్రముఖులు



వరాల సత్తెమ్మను దర్శించుకుంటున్న దుర్గారాణి, పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 20వ వార్డులో కొలువైన వరాల సత్తెమ్మ అమ్మవారి జాతర సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్‌లు ఆదివారం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వరి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాలంగి కమల, యాదగని చంటి, పసుపులేటి వెంకటరమణ, పిల్లి శివ, గండి నాగేశ్వరరావు ఉన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

రాయవరం: పసలపూడిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీపీ నౌడు వెంకటరమణ ఆదివారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, అభిమానులు పాల్గొనాలన్నారు.

కపిలేశ్వరపురం ఎంపీడీఓగా కొండలరావు



కపిలేశ్వరపురం: స్థానిక ఎంపీడీఓగా ఏవీవీఎస్ఆర్ఎస్ కొండలరావు నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండల పరిషత్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎం.రామకృష్ణారెడ్డి ఉండి మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మండలంలోని 19 గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని కొండలరావు తెలిపారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన



సోమేశ్వరం ఆర్బీకేలో జాబితాను ప్రదర్శిస్తున్న ప్రభాకర్

రాయవరం: రబీ సీజన్‌కు సంబంధించి పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కోసం మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల్లో ఆదివారం ప్రదర్శించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామ సభలు నిర్వహించి పంట నమోదు జాబితాలోని పేర్లను చదివి వినిపించనున్నట్టు ఆయన తెలిపారు. ఆర్బీకేల వద్ద ప్రదర్శించిన పంట నమోదు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 6వ తేదీలోగా లిఖితపూర్వకంగా రైతు భరోసా కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాల్నారు. 6వ తేదీ తర్వాత ఎటువంటి సవరణలకు అవకాశం ఉండదన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులు వేగవంతం



కపిలేశ్వరపురంలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

కపిలేశ్వరపురం: గ్రామంలోని రామకృష్ణ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు 1.50లక్షల లీటర్ల సామర్థ్యం గ్ర ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిధులను మంజూరు చేయించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ కొండలరావు తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంక పొలంలోని సారా తయారీ బట్టీపై ఆదివారం అంగర ఎస్సై అందే పరదేశి ఆధ్వర్యంలోని పోలీస్ సిబ్బంది దాడి చేశారు. బట్టీ నిర్వాహకుడు గ్రామానికి చెందిన నామాడి శివరామకృష్ణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. సారా తయారీ సామాగ్రిని స్వాధీనపర్చుకుని, 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, కేసు నమోదు చేసినట్టుట్టు ఎస్సై తెలిపారు.

వ్యవసాయంలో సాంకేతిక విప్లవం

- యాంత్రీకరణ దిశగా వ్యవసాయం
- డ్రోన్ స్ప్రేయర్ల పంపిణీకి రంగం సిద్ధం



డ్రోన్ సహాయంతో మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

కె.గంగవరం: వ్యవసాయంలో రైతులు సాంకేతికత అందిపుచ్చుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇప్పటికే సబ్సిడీ ద్వారా రైతులకు పవర్‌టిల్లర్లు, వరి కోత యంత్రాలను అందించింది. ఆర్‌బీకే వ్యవస్థను తీసుకువచ్చి రైతులకు మేలు చేసింది. రైతులను మినీ శాస్త్రవేత్తలుగా మార్చేందుకు పొలంబడి కార్యక్రమాలు నిర్వహించి వ్యవసాయంలో నూతన ఒరవడిని ప్రభుత్వం సృష్టించింది. దీంతో పాటు రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి రైతు భరోసాను అమలు చేయడంతో పాటు పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీని రైతుల ఖాతాలకే నేరుగా ప్రభుత్వం నిధులు జమ చేస్తుంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి రైతులను మరింత ప్రోత్సహించేందుకు డ్రోన్ స్ప్రేయర్లను అందించడానికి చర్యలు తీసుకుంది. పంటలను ఆశిస్తున్న చీడపీడల నివారణకు పురుగుల మందులు పిచికారీ చేయడానికి ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను పరిచయం చేస్తోంది. సాగులో అన్నదాతలకు బాసటగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం తాజాగా డ్రోన్ స్ప్రేయర్లు ఇవ్వాలని నిర్ణయించింది.

ఏ విధంగా అంటే...

ఒక్కో మండలానికి మూడు గ్రూపులను నిర్ణయించి వారికి డ్రోన్ స్ప్రేయర్లు ఇవ్వాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అద్దె యంత్రాల తరహాలోనే ఇవి కూడా పనిచేసే విధంగా వ్యవసాయ శాఖ ప్రణాళికలను రూపొందించింది. దీని కోసం ఇప్పటికే విధివిధానాలను ప్రకటించింది. ప్రకటించిన విధంగా డ్రోన్ స్ప్రేయర్లు పొందాలంటే ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి వారికి ఒకరు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండే విధంగా చర్యలు తీసుకుంది. గ్రూపులో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన రైతుకు డ్రోన్ స్ప్రేయర్ల వినియోగంపై ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తారు. రూ.6 నుంచి 10 లక్షల విలువైన స్ప్రేయర్లు రాయితీపై వ్యవసాయ శాఖ అందించనుంది. దీనిలో 10 శాతం గ్రూపు వాటా కాగా మిగిలిన 40 శాతం ప్రభుత్వ రాయితీ, 50 శాతం బ్యాంకు రుణం రైతులకు అందిస్తుంది. దీని కోసం గ్రూపు సభ్యులందరూ ఉమ్మడి బ్యాంకు ఖాతాను తెరిచి సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రయోజనాలెన్నో...

ప్రస్తుతం వ్యవసాయంలో వరి సాగుకు సోకిన చీడపీడల నివారణకు మందులు స్ప్రే చేయడానికి కూలీల కష్టం ప్రయాసతో కూడింది. దీనికి తోడు మందులు పిచికారీ చేయడానికి కూడా కూలీలు భారీగా సొమ్ములు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగిపోతుంది. ఇలాంటి తరుణంలో పంటలకు సోకిన చీడపీడల నివారణకు ఎరువులు, మందులు పిచికారీ డ్రోన్ సాయంతో సులువుగా చేయవచ్చు. దీంతో కూలీల సమస్య, అధిక పెట్టుబడి సమస్యను అధిగమించవచ్చు. ఈ డ్రోన్ల సహాయంతో అతి తక్కువ సమయంలోనే ఎక్కువ విస్తీర్ణంలో పంటను నాశనం చేసే చీడపీడల నివారణకు మందును పంటల మీద పిచికారీ చేయవచ్చు. దీంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యువ రైతులకు ఉపాధి కూడా దొరుకుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం నూతనంగా తీసుకున్న డ్రోన్ స్ప్రేయర్ల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే గ్రామ స్థాయిలోని రైతులకు ఈ పథకం ప్రయోజనాన్ని విధి విధానాలను వివరించాం. దీంతో పాటు గ్రూపులుగా ఏర్పడిన రైతులకు డ్రోన్ల వినియోగంపై ఇతర దేశాల్లో కూడా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

– బి.రవి, ఏఓ, కె.గంగవరం

దరఖాస్తులు అందించాలి



డ్రోన్ స్ప్రేయర్ల పొందడానికి రైతులు గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్ మండలాల్లోని రైతులు, మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి పలు దరఖాస్తులు వచ్చాయి. డ్రోన్ స్ప్రేయర్లు ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సరఫరా అయిన వెంటనే రైతులకు అందిస్తాం. ప్రస్తుతం రైతులకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్నాం. కొన్ని సంఘాలకు డ్రోన్ స్ప్రేయర్లు అందించాం.

– జయరామలక్ష్మి, ఏడీఏ, రామచంద్రపురం

ప్రభుత్వ పథకాలకు అర్హతే ప్రామాణికం

కోఆర్డినేటర్ సూర్యప్రకాష్



పట్టణంలోని 23వ వార్డు మేదర్ల వీధిలో పర్యటిస్తున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

రామచంద్రపురం: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఎటువంటి దళారులు లేకుండా పారదర్శకంగా అందాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణం 23వ వార్డు మేదర్ల వీధిలో ఇంటింటా ప్రచారాన్ని సూర్యప్రకాష్ నిర్వహించారు. మేదర్ల సంఘంతో సమావేశము నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కారమయ్యే విధంగా అధికారులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పథకాల గురించి ప్రజలకి వివరిస్తూ త్వరలో రాబోతున్న ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ప్రతి నెలా ఒకటిన తెల్లవారుజామునే పింఛన్ అందిస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ క్రమంలోనే పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణం జరుగుతుందని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వ పాలనే ప్రతి ఇంటికి సచివాలయ వ్యవస్థ ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, వార్డు నాయకులు మానేపల్లి సూరిబాబు, పిల్లి భీమా, చింత శ్రీను, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు నియోజకవర్గ నాయకులు, వలంటీర్స్, గృహ సారథులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు క్రీడలు దోహదం



క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్, యూనిఫాం అందజేస్తున్న కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ తదితరులు

కాజులూరు: యువత ఉజ్వల భవిష్యత్తుకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో దోహద పడతాయని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. గొల్లపాలెం శివారు ధనలక్ష్మీపేటకు చెందిన 'టీమ్ భీమ్' వాలీబాల్ క్రీడాకారులు ఇటీవల పలు ఆటల పోటీల్లో పాల్గొని అవార్డులు సాధిస్తున్నారు. ఈ మేరకు విరాట్ టీవీస్ కంపెనీ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ స్పోర్ట్స్ కిట్, స్పోర్ట్స్ డ్రెస్‌ను సమకూర్చగా ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉన్నత ఉద్యోగాలను సాధించుకో వచ్చన్నారు. క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఇటీవల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.125 కోట్లతో 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆటల పోటీలు నిర్వహించారన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో యువతకు క్రీడలపై ఆసక్తి పెరిగిందన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు పలువురు దాతలు అందిస్తున్న సహకారాలను యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత, గొల్లపాలెం మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, మాదిరెడ్డి పృథ్వీ, మాదిరెడ్డి రామచంద్రరావు (చిన్ని), వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ ప్రధాన కార్యదర్శి నిమ్మితి విజయ్, రాష్ట్ర వైఎస్సార్ యువసేన కార్యదర్శి ఉంగరాల శివ తదితరులు పాల్గొన్నారు.

క్లాస్ ఫోర్ ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

రామచంద్రపురం: రామచంద్రపురం డివిజన్ ఆల్ క్లాస్ ఫోర్ ఉద్యోగుల ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలకు ఎలక్షన్ అధికారిగా సంఘం జిల్లా అధ్యక్షుడు నవరపు చిన పాపారావు వ్యవహరించారు. ఎన్నికల్లో తొమ్మిది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీఆర్ఎస్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు పితాని త్రినాథ్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఏపీజేఏసీ చైర్మన్ మల్లేశ్వరరావు, ఆల్ ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లాల ఆల్ క్లాస్ ఫోర్ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి ఖండవల్లి చంద్రశేఖర్, కాకినాడ పట్టణ అధ్యక్షుడు ముక్కే రామకృష్ణ హాజరయ్యారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

డివిజన్ అధ్యక్షులుగా పడాల సత్య రామప్రసాద్, సహా అధ్యక్షులుగా బేసి గోవిందరాజులు, ఉపాధ్యక్షుడు-1 తోటకూర శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు-2 గుమ్మడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా కొప్పిశెట్టి లోకేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి-1గా శీలం వెంటరమణ, సంయుక్త కార్యదర్శి-2గా సింగంపల్లి అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేలంపోతపు సత్తిబాబు, కోశాధికారిగా వెంపటాపు రాంబాబు, గౌరవ అధ్యక్షుడిగా పలివెల త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మధునాపంతుల ఫౌండేషన్ సేవలు ఎనలేనివి



పల్లిపాలెం మధుశ్రీ కథా గౌరవ సభలో ప్రముఖ కవులను సత్కరిస్తున్న మధునాపంతుల ఫౌండేషన్ నిర్వాహకులు

కాజులూరు: తెలుగు భాష అభివృద్ధికి పల్లిపాలెం మధునాపంతుల ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎనలేనివని సీనియర్ జర్నలిస్ట్, ప్రఖ్యాత కథకుడు, రచయిత చింతకింది శ్రీనివాసరావు అన్నారు. పల్లిపాలెం ఆంధ్రీకుటీరంలోని మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో స్థానిక ఆంధ్రీకుటీరం నిర్వాహకులు మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన ఆదివారం మధుశ్రీ కథా గౌరవ సభ అత్యంత వైభవంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ సాహిత్యం, కళలకు ప్రజాదరణ తగ్గిపోతున్న తరుణంలో మహాకవి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి ఆయన కుటుంబీకులు కాజులూరు మండలం పల్లిపాలెంలో ఎనిమిది దశాబ్దాల నుంచి ఆంధ్రీ కుటీరం పేరుతో ఒక సంస్థను నిర్వహిస్తూ ప్రాచీన కావ్య సంపద, తెలుగు, సాంస్కృతిక భాషలకు జీవం పోస్తున్నారన్నారు. అనంతరం మధునాపంతుల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధునాపంతుల కిరణ్ మాట్లాడుతూ తన తండ్రి మధుశ్రీ వ్రాసిన కథలన్నింటినీ పాఠకులతో చదివించాలని, ఆ కథలు చదివి మరింత మంది తెలుగు కథా సాహిత్యంవైపునకు ఆకర్షితులై రచయితలుగా మారాలనే ఉద్దేశంతో ఆయన కథలను 'మధుశ్రీలు' అనే పేరుతో పుస్తకాలను ప్రచురించామన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఏటా ముగ్గురు కథా రచయితలను ఎంపిక చేసి వారికి అవార్డు, నగదు పురస్కారాన్ని అందించి సత్కరిస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రముఖ కథ విశ్లేషకుడు వంశీకృష్ణ, మల్లేశ్వరరావు, అనిల్ డ్యానిలరె ఎంపిక చేసిన ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ అయిన చింతకింది శ్రీనివాసరావు, ఎండపల్లి భారతి, భగవతంలకు పలువురి ప్రముఖుల చేతుల మీదుగా గౌరవ పురస్కారం, నగదు బహుమతులు అందజేశామన్నారు.

పుస్తక పఠనం వైజ్ఞానిక ప్రగతికి దోహదం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): పుస్తక పఠనం సమాజ వైజ్ఞానిక ప్రగతికి దోహదపడుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కేశవరంలో ఏర్పాటు చేసిన పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ చేతుల మీదుగా ప్రారంభించారు. అందుబాటులోకి తెచ్చిన పుస్తకాలను పరిశీలించారు. గ్రామానికి చెందిన విద్యార్థులు పుస్తక పఠనాభిలాషులు పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, కర్రి పాపారాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, నక్కా సింహాచలం, తుపాకుల ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



మండపేటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేస్తున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకకు చెందిన వీధి సత్యనారాయణ కుమార్తె తోలేటి నాగమణికి చికిత్స కోసం రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈ చెక్కును ఆమె తండ్రి సత్యనారాయణకు మండపేటలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ చేతుల మీదుగా అందజేశారు. ఆర్థికసాయం మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, వీధి గంగాధర్, వీధి రాజు, పేపకాయల సతీష్, కొండవీటి జానకిరామయ్య పాల్గొన్నారు.

మాదిగ రాజకీయ చైతన్య సభను జయప్రదం చేయండి

ఆలమూరు: మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన కోసం ఈనెల ఏడున రావులపాలెం మండలంలోని రావులపాడులో తలపెట్టిన మాదిగ రాజకీయ చైతన్య సభను విజయవంతం చేయాలని వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ పిలుపునిచ్చారు. మండలంలోని గుమ్మిలేరులో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మాదిగల రాజకీయ చైతన్య సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంజయ్ మాట్లాడుతూ మాదిగలు గడిచిన మూడు దశాబ్దాలుగా వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. పాలించే ప్రభుత్వాలు మాత్రం మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని విమర్శించారు. మాదిగల న్యాయమైన కోరిక అయిన వర్గీకరణను సత్వరమే అమలు చేయాలని డిమాండు చేశారు. నా ప్రజలు పాలకులుగా ఉంటారు తప్ప పాలితులుగా ఉండరు అంటూ నినదించిన ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకై చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జింగి సుధాకర్, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుంగ సునీల్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కని స్పందన



పామర్రులో చిన్నారుల వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు



గొల్లపాలెంలో చిన్నారికి చుక్కలు వేసి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మాత భారతి, వైద్యాధికారులు



రాయవరంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ వెంకటరమణ



మండపేట పట్టణంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న చైర్‌పర్సన్, పృథ్వీరాజ్

కె.గంగవరం: పోలియో వ్యాధిని నిర్మూలించాలనే ఉద్దేశంతో వైద్యశాఖ నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి చక్కని స్పందన లభించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. బాలాంత్రం గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్ ప్రారంభించి చిన్నారులకు చుక్కలు వేశారు. కుందురులో ఎంపీపీ పంపన నాగమణి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్యాంపుల వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పామర్రు పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం ఒక్క రోజే 95 శాతం నమోదు అయిందని మిలిగిన ఐదు శాతం సోమవారం సాయంత్రానికి పూర్తి చేస్తామని వైద్యాధికారి హర్షిత తెలిపారు.

శుభ్రతతో అంటువ్యాధులు దూరం

కాజులూరు: శుభ్రత సక్రమంగా పాటిస్తే మనిషి అంటువ్యాధులకు దూరంగా ఉండగలుగుతాడని ఎంపీపీ మాత బారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. మండలంలోని గొల్లపాలెం, దుగ్గుదుర్రు పీహెచ్‌సీలో ఆదివారం వారు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి శిబిరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం గొల్లపాలెంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 2357 మంది ఐదు సంవత్సరాల లోపు వయసు కలిగిన చిన్నారులు ఉండగా 2133 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేసి 90.5 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 2284 మంది ఐదేళ్ల లోపు వయస్సు కలిగిన చిన్నారులు ఉండగా 2150 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేసి 94.1 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. సోమ, మంగళవారాల్లో తమ సిబ్బంది ఇంటింటా పర్యటించి నూరు శాతం కార్యక్రమాన్ని పూర్తి చేస్తారన్నారు.

మహమ్మారిని తరిమికొడదాం

రాయవరం: చిన్నారులు అంగవైకల్యం బారిన పడకుండా ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయడం ద్వారా పోలియో మహమ్మారిని తరిమికొట్టొచ్చని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. పసలపూడిలో జెడ్పీటీసీ మంగతాయారు, రాయవరంలో ఎంపీపీ వెంకటరమణ ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరునవ్వులు చిందించాల్సిన ముఖాల్లో బాధ లేకుండా ఉండేందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేస్తుందన్నారు. పల్స్‌పోలియోపై ప్రజలను చైతన్యం చేసి ఆరోగ్యవంతమైన సమాజానికి అందరూ కృషి చేయాలన్నారు. మండలంలోని 12 గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.శ్రీనివాస్, కె.మణికంఠ, అనిరుధ్, రమ్యశ్రీ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో 4,985 మంది చిన్నారులు లక్ష్యం కాగా సాయంత్రం ఆరు గంటలకు 4,841 మందికి పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో మాపింగ్ అప్ ప్రోగ్రామ్ ద్వారా వేయనున్నట్లు వైద్యాధికారులు వైద్యాధికారులు తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ద్రాక్షారామ పీహెచ్‌సీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ భవాని, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి

డివిజన్ పరిధిలో 95 శాతం పూర్తి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం డివిజన్ పరిధిలో 95 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు రామచంద్రపురం డివిజన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి అన్నారు. మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద ఎంపీపీ అంబటి భవాని, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణలతో కలసి పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రామచంద్రపురం డివిజన్ పరిధిలో కుందూరు, పామర్రు, పేకేరు, అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప, డి.కేశవరం, ద్వారపూడి, గొల్లపుంత(మండపేట), హరిజనపేట(మండపేట), ద్రాక్షారామ, వెల్ల, రామచంద్రపురం పట్టణంలోని కోట హరిజనపేట, ముచ్చుమిల్లి, మాచవరం, రాయవరం పీహెచ్‌సీల పరిధిలో ఐదేళ్ల లోపు వయస్సు కలిగిన వారు 40,279 మంది చిన్నారులు ఉండగా 38,169 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ సూపర్‌వైజర్ జి.కమల్‌శేషు, వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతి భవాని, అలేఖ్య, సందీప్‌నాయుడు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విజయవంతంగా పల్స్ పోలియో

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలో పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమం విజయవంతమైంది. మండపేట పట్టణం 20 వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి చిన్నారికి చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా వైద్య ఆరోగ్య శాఖ అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై అభినందించారు. పట్టణంలోని 30 వార్డులు పరిధిలో 30 బూత్‌ల్లో 4,984 మందికి, రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో 42 బూత్‌ల పరిధిలో 8,736 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా ప్రాంతాల్లో వార్డు కౌన్సిలర్లు, గ్రామాల సర్పంచ్‌లు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కపిలేశ్వరపురం మండలంలో 97 శాతం లక్ష్యం పూర్తి

మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీలలో పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమం 97 శాతం పూర్తయింది. అంగర పీహెచ్‌సీ పరిధిలో 1,294 మంది చిన్నారులకు 1,269 మందికి వేసి 98 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. వాకతిప్ప పీహెచ్‌సీలో 1,511 మంది చిన్నారులకు గానూ 1,474 మందికి చుక్కలు వేసి 97 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. సోమ, మంగళవారాల్లో కూడా కొనసాగుతుందని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు.